# ప్రభువు కొరకు ఫలములు ఫలించుట

## యోహాను 15:1-12, పరిశీలన

మేడగది, పస్కా భోజనం, సమీపిస్తున్న సిలువ, శిష్యులను సిద్ధపరచవలసిన అవసరత – ఇదంతా యోహాను 14–16 నందు వీడ్కోలు ప్రసంగంలోని పరిస్థితియై యుంది. ఈ చర్చలో, ద్రాక్షావల్లి తీగెలు అంటూ సవాలుతో కూడిన సందేశాన్ని ప్రభువు ప్రకటించారు.

ఈ ఉత్ప్రేక్షను వాడడానికి ప్రభువునేది ప్రేరేపించి ఉంటుందో ఊహించడానికి పండితులు తలపెట్టారు. ప్రభురాత్రి భోజనంలో ఉపయోగింపబడిన ద్రాక్షల రసం ఈ పని చేసియుండవచ్చు, లేదా కిటికీగుండ కన్పించే ద్రాక్షచెట్టు ఆ పని జరిగించి యుండవచ్చు. ఆ ప్రసంగంలో చివరి భాగం చర్చించకముందే వారు ఆ మేడగదిని విడిచివెళ్లియున్నట్టయితే (యోహాను 14:31), ఆ చిన్న గుంపుకు ద్రాక్షాతోటే ఎదురుపడి యుండవచ్చు. బంగారు ద్రాక్షావల్లి, వ్రేలాడుతున్న ద్రాక్షావల్లి, వ్రేలాడుతున్న ద్రాక్షల గుత్తులతో ఉన్న దేవాలయాన్ని వారు దాటివచ్చి యుండవచ్చు.[1] పాతనిబంధన నుండి బాగుగా ఎరిగిన అలంకారాన్ని వినియోగించాలని క్రీస్తు కోరియుండవచ్చు (కీర్తన. 80; యెషయా 5; యిర్మీయా 2). అందరు అర్థం చేసికోగలిగిన రూపకం గనుక, క్రీస్తు దీనిని ఉపయోగించియుండవచ్చు కూడ.

ప్రభువు ఎందుకు ఈ అలంకారాన్ని ఉపయోగించారు అనే దానికంటె కూడ, ఈ ఉదాహరణను ఉపయోగించడంలో ఆయన ఏమి సాధించ నిరీక్షించారో అనేది ఎక్కువ ముఖ్యమైన ప్రశ్నయై యుంటుంది. త్వరలోనే ఆయన భూలోకాన్ని విడిచి వెళ్లనైయున్నారు. తన శిష్యులు తన పనిని కొనసాగింపవలసినవారైయున్నారు. వారు దీన్ని ఎలా ముగించాలో గ్రహించవలసి యుంది. ప్రభువు మాటలకున్న పూర్వచరిత్ర యిది:

> నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును; ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును. నేను మీతో చెప్పిన మాటనుబట్టి మీరిప్పుడు పవిత్రులైయున్నారు. నాయందు నిలిచియుండుడి, మీయందు నేనును నిలిచియుందును. తీగె ద్రాక్షావల్లిలో నిలిచియుంటేనేగాని తనంతట తానే యేలాగు ఫలింపదో, ఆలాగే నాయందు నిలిచియుంటేనే కాని మీరును ఫలింపరు. ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నాయందు నిలిచియుండునో నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును; నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండనియెడల వాడు తీగెవలె బయట పారవేయబడి యెండి పోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును.

నాయందు మీరును మీయందు నామాటలును నిలిచియుండినయెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును. మీరు బహుగా ఫలించుటవలన నాతండ్రి మహిమపరచబడును ఇందువలన మీరు నా శిష్యులగుదురు. తండ్రి నన్ను ఏలాగు ప్రేమించెనో నేనును మిమ్మును ఆలాగే ప్రేమించితిని; నా ప్రేమయందు నిలిచియుండుడి. నేను నా తండ్రి ఆజ్ఞలు గైకొని ఆయన ప్రేమయందు నిలిచియున్న ప్రకారము మీరును నా ఆజ్ఞలు గైకొనినయెడల నా ప్రేమయందు నిలిచియుందురు. మీయందు నా సంతోషము ఉండవలెననియు, మీ సంతోషము పరిపూర్ణము కావలెననియు, ఈ సంగతులు మీతో చెప్పుచున్నాను. నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీ రొకనినొకడు ప్రేమింపవలెననుటయే నా ఆజ్ఞ ... మీరు నన్ను ఏర్పరచుకొనలేదు; మీరు నా పేరట తండ్రిని ఏమి అడుగుదురో అది ఆయన మీకనుగ్రహించునట్లు మీరు వెళ్లి ఫలించుటకును, మీ ఫలము నిలిచియుండుటకును నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని (యోహాను 15:1–12, 16).

ఈ మాటలు అసలు అపొస్తలులతో పలికినవి, ప్రత్యేకమైన ప్రాముఖ్యతను [సంక్రమించుకొన్నాయి] పొందాయి (15:16ను గమనించు). ఏదియెలాగున్నా, 1 నుండి 12 వచనాల వరకుగల సందేశం క్రైస్తవులందరికి వర్తిస్తుంది:

ఈ వచనాలలోగుండా మూడు గొప్ప చర్చనీయాంశాలు పోతున్నాయి: (1) దేవుని ఆజ్ఞలు గైకొనడం, (2) దేవుని కొరకు ఫలములు ఫలించడం; (3) దేవుని ప్రేమయందు నిలిచియుండడం. ముక్కాల పీటలోని మూడు కాళ్లు ఒకదానినొకటి బలపరచుకున్నట్టుగా, ఈ మూడు చర్చనీయాంశాలు ఉన్నాయి. ఈ చర్చనీయాంశాలలో రెండవ దానిమీద – ఫలములు ఫలించుటమీద – ఈ ప్రసంగం కేంద్రీకరింపబడింది.[2]

## ఫలములు-ఫలించు వాస్తవం

ఈ లేఖన భాగమంతటిలో దాగియున్న ఉద్దేశం ద్రాక్షావల్లి యొక్క తీగెలు ఫలాలు ఫలించడానికే ఉంటాయని చెప్పడమే (2, 4, 5, 8 వచనాలు). ఈ ఉద్దేశాన్ని నెరవేర్చడంలో తప్పిపోయిన తీగె తన ఉనికిని సమర్థించుకోలేదు. ఫలించని తీగెలు ఫలించే తీగెలకు చెందవలసిన పోషణను పొందకుండునట్లు, అవి ద్రాక్షవల్లిలోనుండి తుంచివేయబడుతాయి (2, 6 వచనాలు). ఆలాగే, క్రైస్తవులుగా మనకని ఒక ఉద్దేశముంది. అది ఫలములను పండించడం. ప్రభువు యిలా అన్నారు: "మీరు బహుగా ఫలించుటవలన నా తండ్రి మహిమపరచబడును; ఇందువలన మీరు నా శిష్యులగుదురు" (8 వ.). ఫలములు ఫలించడమనేది ఒకడు కోరుకునే విషయం కాదు; క్రీస్తును వెంబడించడంతో అది ముడివేయబడియుంది. ఇతర క్రైస్తవ కార్యకలాపాలతో ఫలాలు ఫలించడమనేది చేర్చ బడింది కాదు. ఫలాలు ఫలించడం మన ఉద్దేశమైయుంది. ఫలాలు ఫలించకపోతే, మన ఉనికి యొక్క ఉద్దేశాన్నే కోల్పోతాం.

మనం ఫలించవలసిన ఫలమేమి? "ఫలము" అనేదాన్ని క్రొత్త నిబంధన పలు విధాలుగా ఉపయోగించింది.[3] యోహాను 15లో ఫలాలంటే, "ఆత్మ ఫలమని" కొందరు తలంచారు. "ఆత్మ ఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము,

దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము. ఇట్టివాటికి విరోధమైన నియమమేదియు లేదు" అని పౌలు రాశాడు (గలతీ. 5:22-23ఎ). క్రీస్తును పోలిన గుణగణాలు మనం పెంపొందించుకున్నప్పుడు "ఫలించువారమై" యుంటామని కొందరన్నారు. ప్రభువు కొరకు పనిచేయడంలో వచ్చిన అనుకూల ఫలితాలే "ఫలించడమని" మరికొందరు అన్నారు. "నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే ... శరీరమందు జీవించుటయే నా పనికి ఫలసాధనమైనయెడల నేనేమి కోరుకోవలెనో నాకు తోచుట లేదని" పౌలు అన్నాడు (ఫిలిప్పీ. 1:21, 22ఎ). "ఇది నా పనికి ఫలము" అని KJV అంది.

బైబిల్లో "ఫలము" అనే సామాన్య పద ప్రయోగానికి పునరుత్పత్తిచేయు అనే భావముంది (ఆది. 1:11; లూకా 1:42). వేపచెట్టు ఫలము వేపచెట్టు, నారింజచెట్టు ఫలము నారింజచెట్టు, క్రైస్తవుని ఫలము మరోక క్రైస్తవుడని ఒక వ్యక్తి అన్నాడు. భౌతిక పరిధిలో, నరజాతి, "ఫలించి, అభివృద్ధిపొంది విస్తరించి" భూమిని నిండించాలి (ఆది. 1:28; ఆది. 9:1, 7లను చూడు). ఆత్మ సంబంధమైన లోకంలో, అలాటి సవాలే ఉంది. పౌలు ఈ సందర్భంగా యిలా రాశాడు,

> కావున నా సహోదరులారా, మనము దేవునికొరకు ఫలమును ఫలించునట్లు మృతులలోనుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరముద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి (రోమా. 7:4).

రోమా. 7:4లో "ఫల" మనేది సాధారణంగా ఉపయోగింపబడినదై యుండవచ్చు, కాని వివాహము అనే ఉదాహరణ పిల్లలు అనే "ఫలము" – ఆత్మసంబంధమైన పిల్లలు, అంటే నూతన క్రైస్తవులు అనే భావాన్ని సూచిస్తుంది. రోములోని సంఘానికి వ్రాసినప్పుడు, పౌలు ఈలాటి ఫలాలు ఫలించాలనే మాట్లాడియుండవచ్చు. "నేను ఇతరులైన అన్య జనులలో ఫలము పొందినట్లు మీలోకూడా ఫలమేదైనను పొందవలెనని అనేక పర్యాయములు రానుద్దేశించితిని" అని అతడు వారికి తెలియజేశాడు (రోమా. 1:13).

యోహాను 15లోని "ఫలాలకు" సంబంధించి, ప్రస్తావించబడిన వాటి మధ్య వేటినైనా కోరుకుంటామా? ఆత్మ ఫలాలులేకుండ క్రీస్తువంటి గుణగణాలను మనం పెంపొందించు కోగలమా? నశించినవారిని పట్టించుకోకుండా క్రీస్తు వలె ఉండి ఆత్మచే నింపబడగలమా? "నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను" అని ప్రభువన్నారు (లూకా 19:10); మరియు మనం "ఆయన అడుగుజాడలయందు నడుచుకోవాలి" (1 పేతురు 2:21). ఆత్మలు రక్షింపబడేలా మన విశ్వాసాన్ని పంచు కొనడంలోగల ప్రాముఖ్యతను గుర్తించాలి.

వర్తింపును మనస్సులో పెట్టుకొని, ఈ విషయాన్ని ఆలోచించు: తీగెలు ఉండే ఉద్దేశమే ఫలాలు ఫలించడం; ఆ పనిచేసేది ద్రాక్షవల్లికాదు, తీగెలే. తీగెలు తమ పనిని నెరవేర్చడానికి ద్రాక్షవల్లి సామర్థ్యమిస్తుంది. కాని తీగలే ఫలాలను పండిస్తాయి. తీగెలే ఫలించక పోయినట్టయితే, ఫలాలే ఉండవు. నశించినవారిని నీవు నేను సంధింపనంత కాలం,

రక్షింపబడేవారు ఉండరు.

క్రొత్త నిబంధనలో, విశ్వాసాన్ని పంచుకొనడమనేది ఎక్కువగా ఆజ్ఞాపించబడలేదు. క్రైస్తవుడవ్వడంతో అది సహజమైన కార్యంగా భావించబడుతుంది. మత్తయిలో చెప్పబడిన గ్రేటె కమిషన్ మనలో ఎక్కువ మందికి తెలుసు: "కాబట్టి మీరు వెళ్లి. సమస్త జనులను శిష్యులుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు ..." (మత్తయి 28:19) "వెళ్లుతూ సమస్త జనులను శిష్యులుగా చేయుడి"[4] అంటే, "నీవు వెళ్లేటప్పుడు, నీవు కలిసికొనే ప్రతి ఒక్కనికి ఉపదేశించు" అని అర్థం. హింసచే యెరూషలేము సంఘము చెదరిపోయినప్పుడు జరిగింది అదే:

> ఆ కాలమందు యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున, అపొస్తలులు తప్ప అందరు యూదయ సమరయ దేశములయందు చెదరిపోయిరి.
>
> కాబట్టి చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారముచేసిరి (అపొ. 8:1, 4).

మనం ఏమి పంచుకుంటున్నామో మనం గ్రహించినట్టయితే, ఆ పంచుకునేది సహజమైయుంటుంది. మనం యేసునందలి మన విశ్వాసాన్ని పంచుకొంటున్నాం; మనం సువార్తను పంచుకొంటున్నాం, ప్రధానం చేయబడిన యువతి, అప్పుడు తనకు పెట్టిన ఉంగరాన్ని చూపమని ఎవరూ వేడుకొనక్కరలేదు. ఆమె తన ఉంగరాన్ని ప్రతివారికి చూపడం సహజం. క్రొత్తగా తండ్రి అయినవాడు, తన శిశువును గూర్చి చెప్పమని, తన నూతన మనుమసంతతిని ఫోటోలను చూపుమని అవ్వను అడుగనక్కరలేదు. మంచి సమాచారాన్ని పంచుకొనడం సహజమైయుంటుంది. విపత్తులతో మూల్గులిడే లోకం మంచిసందేశం కొరకు తపించుతుంది.[5] క్రీస్తు యొక్క సువార్త మనకుంది! ఆ సువార్తను పంచు కొనడం మనకు ఎంతగా సహజమైయుండాలి!

"ఎలాగు?" అని కొందరు అడుగవచ్చు. "నేను నా విశ్వాసాన్ని పంచుకొవాలి? ఇతరులను క్రీస్తు కొరకు సంపాదించడం అనే భావనలో నేను ఎలా ఫలించాలి?" అది ఎలాగు? అనే విషయాన్ని ఈ భాగం మనకు తెలుపదు; అయితే పంచుకొనడం అవసరమని అది మనకు తెలుపుతుంది. మన విశ్వాసాన్ని పంచుకొనడంలో చాలా మంచి పద్దతులున్నాయి, వందలకొలదే ఉన్నాయనుకోవచ్చు. మనలో ప్రతి ఒక్కరం వేరైన వ్యక్తులం. ఒకరియొద్ద పనిచేసింది యింకొకరిమీద పనిచేయకపోవచ్చు.[6] మనం ఏ పద్ధతి ఉపయోగించినా, అందులో జీవిత ప్రదర్శనం, ఉపదేశం యిమిడియుండాలి. ఫిలిప్పీ. 2:15, 16ల్లో పౌలు ఈ రెండింటిని జోడించాడు:

> మీరు మూర్ఖమైన వక్రజనము మధ్య, నిరపరాధులును నిష్కళంకులును అనింద్యులునైన దేవుని కుమారులగునట్లు, సణుగులును సంశయములనుమాని, సమస్త కార్యములను చేయుడి. అట్టి జనము మధ్యను మీరు జీవవాక్యమును చేత పట్టుకొని,

లోకములో జ్యోతులవలె కనబడుచున్నారు ...

(1) ***జీవితం.*** నీవు నమ్మకమైన క్రైస్తవ జీవితాన్ని, ఆశలో, నిరాశలో ఎటుచూచినా, జీవించాలి. అనుకూలంగా, మంచి జీవితాన్ని జీవించుతూ, యితరులను ప్రేమించాలి. సహాయం చేయాలి. ప్రతికూలమంటే, చెడుగును నీ జీవితంలోనుండి దూరం చేయాలి. నీ బోధకు అనుకూలంగా జీవిచంలేనట్టయితే, నీ ఉపదేశాన్ని వినేవాడెవడూ ఉండడు.[7]

(2) ***ఉపదేశం.*** నీ జీవితం ఎంత మంచిగా ఉన్నా, నీవు సువార్తను చెప్పుతూ ఉండాలి. సత్యాన్ని అనుసరించి జీవించినంతకాలం, సత్యాన్ని ప్రకటించనక్కరలేదని కొందరు తలంచుతారు. నీవు క్రీస్తువారికంటే శ్రేష్ఠుడవా? తన జీవితంవలన మాత్రమే ఆయన ఫలము ఫలించలేదు. సత్యాన్ని ఉత్తరాల ద్వారాగాని, కరపత్రికల ద్వారా గాని ... ముఖాముఖిగా గాని పంచుకోవచ్చు. ఇతరులకు నీవు ఏ రూపంలో ఉపదేశిస్తావని కాదు, నీవు ఏదో ఒక రూపంలో ఉపదేశించాలి.

నేను తిరిగి ఈ ఆలోచనకు వస్తాను: యోహాను 15 ప్రకారం, ఫలించడమంటే క్రైస్తవుడైయుండడమే. తీగెలుగా మన పాత్ర ఏమో ఒప్పింపబడినవారమైయుంటే, ఫలించే మార్గం మనకు తెలిసి యుంటుంది.

## ఫలములు ఫలించు బాంధవ్యం

ఫలాలు ఫలించడంలో క్రీస్తు ఉపదేశం యొక్క ముఖ్యమైన సంగతి – ఆయనకు వేరుగా ఉండి మనం ఏమియు చేయలేం – అనేదే. “నాయందు నిలిచియుండుడి” అంటూ 4వ వచనం ఆరంభమౌతుంది.

ద్రాక్షవల్లికి తీగెలకు మధ్యగల సంబంధం గూర్చి శాస్త్రపరమైన ఉపన్యాసం యివ్వవచ్చు. వేళ్లద్వారా తీగెలకు నీరు, పోషకపదార్థాలు వస్తాయని చెప్పవచ్చు: ఆకుల్లో ఉన్న పచ్చదనంవలన సూర్యారశ్మినుండి ఆహారం తయారు చేసికొంటాయని చెప్పవచ్చు.[8] అయినా, యిది చెట్లను పెంచే పాఠం కాదు, గాని బాంధవ్యాలకు సంబంధించిన ప్రసంగమైయుంది. శాస్త్రీయమైన సంగతులు నీకు తెలియకపోవచ్చు. అయితే నీవు ఒకటి మాత్రం గ్రహించగలవు: తీగె ద్రాక్షావల్లితో సజీవంగా అతుకబడియుంటేనే బ్రదికినట్టు లెక్క. గత దినాల్లో ఆ తీగె ఎంతపొడవైనా ఎదిగియుండవచ్చు, ఎంతో బలంగా పచ్చగా కూడా కన్పించియుండవచ్చు. అది ఎంతో ఆరోగ్యంగా ఆకర్షణీయంగా కూడ కన్పించవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో, అది ద్రాక్షావల్లితో అతికి యుండకపోతే, అది మృతతుల్యమైనదే.

క్రీస్తుతో మనకుండే సంబంధం కూడ ఆలాటిదే. ఆత్మసంబంధమైన మన జీవితానికి ఎదుగుదలకు ఆయన అవసరం. మనం ఆయనలోనికి బాప్తిస్మం పొందాం (రోమా. 6:3–6; గలతీ. 3:26, 27). ఆయనయందు మనం నూతన సృష్టియై యున్నాం (2 కొరింథీ. 5:17). ఆత్మసంబంధమైన సమస్త ఆశీర్వాదములన్నీ ఆయనయందున్నాయి (ఎఫెసీ. 1:3). ఆయనయందు మనకు విమోచన ఉంది (కొలస్సీ. 1:13, 14).

ఆత్మలను సంపాదించవలసినంతగా మనం ఎందుకు చేయలేక పోతున్నాం? మన

విశ్వాసాన్ని మనం ఎందుకు పంచుకొనడం లేదు? ఆత్మ సంబంధంగా మనం ఎందుకు ఎదుగలేదు? భక్తిగల క్రైస్తవ జీవితాలను మనం ఎందుకు జీవించడం లేదు? మన హాజరులో ఎందుకు నమ్మకంగా ఉండడం లేదు? ఈ ప్రశ్నలన్నిటికి జవాబు ఒక్కటే. క్రీస్తుతో మనకు ఉండవలసిన బాంధవ్యం సరిగాలేదు. "ఎవడు నాయందు నిలిచి యుండునో నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును ..." అని ప్రభువు తెలిపారు (యోహాను 15:5బి). మన బాంధవ్యం సరిగా ఉంటే, మనం ఫలించుతాం.

బాంధవ్యం కీలకమైయుంది. వ్యక్తిగతమైన ఒక ఉదాహరణను ఉపయోగించ గోరుతున్నాను. అలసిపోయిన, పనులతో నిండియున్న, ఆర్థిక బాధ్యతలతో నా మనస్సు కలత చెందుతున్న ఒకనాటి అనుభవంలోనికి మనస్సు వెళ్లుతుంది. మా కుమార్తెలలో ఒకరు ఫోను చేసి. "డాడీ, సహాయం కావాలి," "నాకు నిజంగా సహాయం కావాలని అడిగింది." అయితే, "నేను అలసియున్నాను," "నాకు అసలు తీరిక లేదు," "నా దగ్గర డబ్బులేదు" అని నేను చెప్పలేదు. ఏదో ఒక విధంగా మా కుమార్తెకు నేను సహాయం చేస్తాను. ఎందుకు? ఆమెతో నాకున్న ప్రత్యేకమైన బాంధవ్యాన్ని బట్టి; ఆమె నా కుమార్తె.

ఈ గడియకు సంబంధించిన ప్రశ్న ఏమంటే - "క్రీస్తు ప్రభువుతో మనకున్న సంబంధం ఎలాటిది?" అంటే, నీవు క్రీస్తు లోనికి బాప్తిస్మం పొందియున్నావా? అలా నీవు పొంది యున్నట్టేయితే, యిప్పుడు నీవు ఆయనకొరకు జీవిస్తున్నావా? ప్రభువు కొరకు జీవించడమనే సంగతిని వ్యక్తిగతమైన దానిపై ఆధారంచేసి, తన మొదటి పత్రికలో యోహాను యిలా అన్నాడు: "ఆయనయందు నిలిచియున్నవాడనని చెప్పుకొనువాడు ఆయన ఏలాగు నడుచుకొనెనో ఆలాగే తానునూ నడుచుకొన బద్ధుడై యున్నాడు" (1 యోహాను 2:6), తన సహోదరుని ప్రేమించును (2:9, 10), పాప జీవితపు విధానంలో నడుచుకొనక యుండును (3:6). క్రీస్తుతో మనకు సరియైన సంబంధమున్నయెడల, ఫలములు ఫలించు మార్గాన్ని కనుగొంటాం.

ఫలాలు ఫలింపని వారి పర్యావసానాన్ని గూర్చి యోహాను 15:1-12 కొన్ని తీవ్రమైన ప్రతిపాదనలను చేసింది. "నాలో ఫలింపని ప్రతి తీగెను ఆయన తీసిపారవేయును" అని 2వ వచనంలో ఆయన అన్నారు. అట్టివాటిని "అగ్నిలో పడవేయు" పరిస్థితిని గూర్చి ఆరవ వచనం అంటుంది. మనం ఆత్మలు సంపాదించని వారమైనందుకు నరకానికి పోతామని ఈ లేఖనం అనలేదు. కాని ప్రభువైన యేసుతో సరియైన బాంధవ్యం లేకున్నందుకు మనం నశించిపోయే అవకాశముందని ఈ భాగం చెప్పుతోంది. 6వ వచనాన్ని మరలా చూడు "ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగెవలె బయట పారవేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును"

తమ విశ్వాసాన్ని యితరులతో పంచుకోనివారు సాకుకొరకు/వెదకుతారు. "నాకు సిగ్గు", లేక "జనులకు యింట రెస్ట్‌లేదు," లేదా "నేను మంచి ఉపదేశకుడను కాను" లేదా, "నాకు ఎక్కువగా తెలియదు" లేక "నాకు సమయంలేదు" అంటూనే ఉంటారు. సంబంధాలకొరకు వెదకవలసిన సమయంలో వారు హేతువులకొరకు వెదుకుతూ ఉంటారు. "నన్ను బలపరచువానిద్వారా సమస్తమును చేయగలను" అని పౌలు అంటారు

(ఫిలిప్పీ. 4:13).

## ఫలములు ఫలించుటకు కావలసినవి

ఫలములు ఫలించడానికి ప్రధానమైన దాన్ని స్థాపించాం – అది నిజమైన ద్రాక్షావల్లితో సరియైనా సంబంధం. తిరిగి లేఖన భాగమును గమనించి, ఫలాలు ఫలించడానికి అవసరమైన కొన్ని సంగతులను కనుగొందాం. సువార్త ప్రకటించడంలో నిపుణత, – అంటే, యితరులతో సువార్తను పంచుకొనడానికి చాతుర్యముగల నాలుక, మంచి వ్యాపారి,[9] లేక గొప్ప జ్ఞానం కావాలని కొందరు తలంచుతారు. వీటిలో దేనిని గూర్చియు లేఖనం చెప్పదు. కాని అది నాలుగు సంగతులు అవసరమని తెలుపుతుంది.

(1). *లోబడు స్వభావం.* దేవుడు వ్యవసాయకుడు (యోహాను 15:1) – ఆయన ఆ ద్రాక్షాతోటకు సొంతగాడు. ఆయన ఫలించే తీగె మరి ఎక్కువగా ఫలించాలని కొరుకుంటాడు (2 వ.). మనలో కొన్ని చెడ్డ లక్షణాలుంటాయి. అవి కత్తిరించవలసి యుంటుంది. ఆయనకును, ఆయన కుమారునికిని నేను ఎల్లప్పుడు లోబడు స్వభావంగలవాడనై యుండాలి. "మీరు నా ఆజ్ఞలు గైకొనినయెడల నా ప్రేమయందు నిలిచియుందురు" అని ప్రభువు సూచించారు (10 వ.).

(2). *చదివే మనస్సు.* ''నేను మీతో చెప్పిన మాటనుబట్టి మీరిప్పుడు పవిత్రులైయున్నారు" అని క్రీస్తు ఆయన శిష్యులకు తెలిపారు (3 వ.). "పవిత్రులు" అనే పదమును కొమ్మలను నరుకు అనే పదమును ఒకే గ్రీకు మూలంనుండి వచ్చాయి (2 వ.). పవిత్రపరచు సాధనము ఆయన వాక్యం. "మీయందు నా మాటలును నిలిచియుండిన యెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును" అని ప్రభువు తన పదకొండు మంది అపొస్తలులకు తెలియజేశారు (7 వ.).

ఫలములు ఫలించడానికి దేవుని వాక్య జ్ఞానము అవసరమైయుంది – ప్రత్యేకించి సువార్త మూలమైన ఫలములను ఫలించడానికి. బైబిలు సద్టి, ఆత్మల సంపాదన ఒకదానితో నొకటి కలిసిపోతాయి. నాకు నిజంగా వాక్యం తెలిసియుంటే, నేను దాన్ని పంచుకోగోరతాను. నేను పంచుకొంటున్నట్టయితే, యింకా దాన్ని ఎక్కువగా నేర్చుకోవాలని కోరుకుంటా. "నీతి కొరకు ఆకలిదప్పులుగలవారు ధన్యులు, వారు తృప్తిపరచబడుదురు" అని ప్రభువు పలికారు (మత్తయి 5:6). కష్టపడి పని చేసేదానికంటె "ఉత్తమ మయ్యింది" లేదు. ప్రభువు కొరకు విరామంలేకుండా ఉండడం కంటె – ప్రత్యేకంగా సత్యాన్ని పంచుకొనడం కంటె మేలైనది లేదు.

(3). *సమర్పణతో కూడిన హృదయం.* ప్రభువుతో ఉండడానికి మనలను మనం సమర్పించుకోవాలి. యోహాను 15లో ఆయన వర్తమానం "నాయందు నిలిచి యుండుడి" (4 వ.) అనేది "మీరు నాయందు నిలిచియున్నయెడల," కొన్ని ఆశీర్వాదములు పొందుతారని ఆయన తెలిపారు (7 వ.). అనేక రూపాల్లో ప్రభువుతో మనకున్న సంబంధం ద్రాక్షావల్లితో తీగెలకు ఉన్న సంబంధం వంటిదే. అయినా, ఒక సందర్భంలో, ఈ పోలిక పనిచేయదు: ద్రాక్షవల్లితో అతుకబడియుండడమా లేదా అనే విషయంలో తీగెలకు స్వాతంత్రం లేదు – మనకైతే ఉంది.

విశ్వాసికున్న భద్రతను గూర్చి బైబిలు బోధిస్తుందిగాని, భ్రష్టత్వం అసాధ్యమని అది

చెప్పదు. నేను ద్రాక్షావల్లితో అతుకబడియున్న తరువాత కూడ, తీసిపారవేయబడే అవకాశమున్నట్టు యోహాను 15 బోధిస్తుంది. రక్షింపబడాలంటే, నేను ప్రభువునందు నిలిచియుండాలి. తీర్పుదినాన, బాప్తిస్మపు సర్టిఫికేట్[10] తీసి, "ఇదిగో నేను ఫలాన దినాన బాప్తిస్మం పొందాను చూడు, నన్ను లోపలికి రానియ్యాలి" అని నీవు చెప్పలేవు. రక్షణకు బాప్తిస్మం అవసరమే, కాని ప్రభువుకు నమ్మకంగా ఉండడం కూడ అవసరమే (ప్రకటన 2:10). "క్రీస్తులోనికి" బాప్తిస్మం పొందడం ప్రాముఖ్యము (రోమా. 6:3, 4; గలతీ. 3:26, 27), కాని క్రీస్తులో నిలిచియుండడం కూడ ప్రాముఖ్యమే (రోమా. 3:24; 6:11, 23; 8:1, 39; 2 కొరింథీ. 2:14; ఫిలిప్పీ. 4:7, 19; 1 థెస్స. 4:16).

(4). ***స్థిరమైన బుద్ధి.*** తీగెల స్వభావం ఎదుగుట. అవి ఎదగడం మానినవంటే, అవి చస్తాయి. "చెట్టు చిటారు కొమ్మలలో నూతన మొలకలు [చిగుళ్లు] లేనట్టయితే, వేళ్లలకు చావుదెబ్బ తగిలిందన్నట్టే" యని ఒక వ్యక్తి అన్నాడు. నీవు, నేను దానిని తీర్మానించుకోవలసి యుంటుంది దేవుని సహాయముతో క్రైస్తవులుగా మనం ఎదుగుదాం. ప్రత్యేకించి "ఫలాలు" ఫలించే విషయంలో మనం ఎదగాలి. యోహాను 15 "ఫలములను" గూర్చి పలుకుతుంది (2 వ.); "బహుగా ఫలించుటను" గూర్చి కూడా పలుకుతుంది (5, 8, వచనాలు), సువార్త సంబంధమైన ఫలములు మరియు "అధికముగా ఫలించుట" (2 వ.). ఆత్మల సంపాదనకంటె ఆత్మ సంబంధమైన ఎదుగుదలకు ఎక్కువైన క్రైస్తవ కార్యకలాపాన్ని నేను దేనిని ఎరుగను.

## ఫలించుటవలన కలుగు ఫలితములు

ఈ ప్రసంగం ముగిస్తుండగా, ఫలాలు ఫలించడంవలన కలుగు మంచి ఫలితాలను ఆలోచించుదాం.[11]

మనం ఆత్మ సంబంధంగా ఎదుగుతాం. మనం శుద్ధీకరించబడతాం మనం "బహుగా ఫలించుదుము" (5,8 వచనాలు) మరియు "అధికంగా ఫలించుదుము" (2 వ.). ఈ ప్రసంగం సువార్త సంబంధమైన ఫలములు గూర్చి నొక్కి చెప్పుతుంది. ఆత్మల సంపాదన కంటె ఆత్మ సంబంధమైన ఎదుగుదలకు ఎక్కువైన క్రీస్తు కార్య కలాపాన్ని నేను దేనిని ఎరుగను.

*మన ప్రార్థనలు జవాబులు పొందుతాయి* (7 వ.). నీ ప్రార్థనా జీవితం ఉండవలసిన తీరులో ఉండక పోయినట్టయితే, క్రీస్తుతో నీకున్న సంబంధాన్ని పరీక్షించుకో–ఫలము ఫలిస్తున్నావో లేదో నిన్ను నీవే ప్రశ్నించుకో.

*దేవుడు మహిమ పరచబడతాడు* (8 వ.). ద్రాక్షాతోట తనదని, ఆయన వ్యవసాయ కుడని గుర్తుంచుకో, తీగెలు ఫలించునప్పుడు, ఆయన సహజంగానే మహిమ పరచబడతాడు.

*మనం నిజముగా ప్రభువునకు శిష్యులమైనట్టు మనలను మనమే చూపుకుంటాం* (8 వ.).

*మనం ఆనందిస్తాం* (11 వ.). "నా ఆనందమును నా కిరీటమును" అని పౌలు

తాను ప్రభువులోనికి నడిపించిన వారిని గూర్చి చెప్పుకున్నాడు (ఫిలిప్పీ. 4:1). విశ్వాసంలో తనకు పిల్లలైనవారు సత్యమునను సరించి నడుచుకొంటున్నారని వినడం కంటె ఎక్కువైన సంతోషము తనకు లేదని యోహాను వ్యక్తపరచాడు (3 యోహాను 4).

*ఆత్మలు రక్షింపబడతాయి – మనవి మరియు యితరులవి కూడా.*

## ముగింపు

చురుకుగా ఉండే స్థానిక సంఘంలో భాగమైయుండ గోరతాను. సంతోషంగాను బిజీగాను ఉండే క్రైస్తవులతో కలిసియుండడం ఎంత మనోహరం. అయితే అనేక విషయాలను చేపట్టి, ప్రభువు సంఘంగా ఉండకుండా దృష్టిని "మళ్లించుకునే" అపాయముందని నేను భయపడుతున్నా. దేవునికొరకు ఫలాలు ఫలించడానికి మనం ఉన్నామనే సంగతిని మనం విస్మరిస్తాం. ఫలాలు ఫలించడానికి సమానమైనది మరేదిలేదు. ఆయన కొరకు ఫలములు ఫలించినట్లు దేవుడు మనకు సహాయంచేయును గాక.[12]

---

సూచనలు

[1]ఆభరణాలను గూర్చిన వివరణను "క్రీస్తు జీవితం, 5"లో చూడు. [2]ఈ ప్రసంగంలో ఆత్మల సంపాదనలపై నొక్కి చెప్పడమయింది, అయితే క్రీస్తు లాంటి జీవితం జీవించుటలోని అవసరత లేక ఆత్మ యొక్క ఫలము అనే అంశాలపై ప్రసంగించుటకు ఉపయోగించవచ్చు. [3]"ఫలము" అనే పదం పలువిధాలుగా ఉపయోగించబడింది. మరియొకని జీవితములో నీవేమి చూస్తున్నావో దానిని తెలిపేదిగా ఉండవచ్చు (మత్తయి 3:10; 7:16–20); నమ్మదగిన, అభివృద్ధికరమైన క్రైస్తవ జీవితపు ఫలము (ఎఫెసీ. 5:9; ఫిలిప్పీ. 1:11; కొలస్సీ. 1:10; హెబ్రీ. 12:11; యాకోబు 3:17, 18); లేక ఫలితం లేక ప్రయాసపు బహుమానం విస్తరింపచేయుట (యోహాను 4:36; 12:24). దేవునికి పాతనిబంధనలో తొలి ఫలముల సమర్పణ (తొలి పంటనుండి) గూర్చి ఉపయోగించిన అలంకారపు భాషా ప్రయోగం "తొలి పంట" (రోమా 8:23; 1 కొరింథీ. 15:20, 23; 16:15). [4]Alfred Marshall, *The Interlinear Greek-English New Testament*, 2d ed. (London: Samuel Bagster and Sons, 1958), 136. [5]ఈ అంశం పై మాటలాడునప్పుడు వార్తల్లో వచ్చిన "చెడు" సందేశాన్ని ఉదహరించు. [6]శ్రోతలకు సంబంధించినదాన్ని తెలుపు. [7]వ్యక్తిగతమైన ఉదహరణను చెప్పు. [8]"క్లోరోఫిల్" అనే గ్రీకు పదానికి ఆకుల్లో ఉన్న "పచ్చని" రంగును చూపించునది. [9]మీ ప్రాంతంలోనివారికి సంబంధించినదానిని వివరించి. [10]సమయోచితంగా ప్రతిపాదనను ఉపయోగించు.

[11]చెప్పబడిన వాక్య భాగాలు చదివి వివరించు. [12]విశ్వసించినవారికి క్రీస్తులోనికి బాప్తిస్మం పొందుట యొక్క అవసరతను తెలిపి ప్రోత్సహించు లేక ప్రభువు యొద్దనుండి దూరమైనవారిని మారుమనస్సు పొందేలా హెచ్చరించు.